సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం । 7 । డిసెంబర్ । 2024



భవిత కేంద్రాల్లో 'ప్రత్యేక' శిక్షణ
శారీరకంగా, మానసికంగా ఎదుగుదల సరిగా లేని చిన్నారులకు భవిత కేంద్రాలు దిక్సూచీగా మారాయి. - 10లో



రైతన్నకు అపార నష్టం
జిల్లాలో వేలాది మంది రైతులకు చెందిన వరిపంట ఫెంగల్ తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు తడిచింది. - 10లో



బాధితులకు అండగా వైఎస్సార్‌సీపీ
రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది. విద్యార్థులపై కూడా అక్రమ కేసులు బనాయిస్తోంది. - 10లో

రీ సర్వే లోపాలపై ఫిర్యాదులు నిల్

- గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా భూముల రీ సర్వే
- జిల్లాలో రెండు విడతలు పూర్తి
- చాలా వరకూ భూ సమస్యలకు మోక్షం
- కూటమి ప్రభుత్వం వచ్చాక రీ సర్వే నిలుపుదల
- రీ సర్వేలో తప్పిదాలు జరిగాయని.. పేదల భూములు లాక్కొంటారని దుష్ప్రచారం
- 22ఏ, ఫ్రీ హోల్డ్ పేరిట గత ప్రభుత్వంలో ఆక్రమణలు జరిగాయని ప్రజలను నమ్మించే యత్నం
- ప్రస్తుతం చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లోనూ ఇదే విషయాన్ని బూచిగా చూపించే ప్రయత్నం
- రెవెన్యూ సదస్సుల్లో ఇదే విషయంలో రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని ఆదేశాలు
- తొలిరోజు సదస్సులో ఒక్క ఫిర్యాదు అందని వైనం



వీరఘట్టం మండలం నడుకూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వినతులు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారి

సాక్షి, పార్వతీపురం మన్యం:

జిల్లాలో రెవెన్యూ సదస్సులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చేనెల 8వ తేదీ వరకు సదస్సులు జరగనున్నవి. వీటిలో ప్రజల నుంచి అధికారులు వినతులు స్వీకరిస్తున్నారు. భూవివాదాల పరిష్కారానికే ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేస్తున్నా దీనికి వెనుక ఉన్న ఉద్దేశం వేరేలా ఉందన్న విమర్శలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల రీ సర్వేలో లోపాలున్నాయన్నది బూచిగా చూపాలన్నదే ప్రధాన ఎత్తుగడగా నిర్వహిస్తున్న సదస్సుల్లో.. తొలిరోజు రీ సర్వే లోపాలపై ఒక్క ఫిర్యాదు అందకపోవడం గమనార్హం.

ఇదీ పరిస్థితి...

జిల్లాలో 965 రెవెన్యూ గ్రామాలుండగా.. 33 రోజులపాటు రెవెన్యూ సదస్సులను నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. వాస్తవానికి ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్‌ఎస్‌లో భూసమస్యలపైనే సుమారుగా 50 నుంచి 60 శాతం ఫిర్యాదులు అందుతున్నాయి. ఇది ఇప్పటి సమస్య కాదు. ప్రభుత్వాలు ఎన్ని మారినా రెవెన్యూ పరమైన సమస్యలు, భూ వివాదాలు ఉంటూనే ఉన్నాయి. ఇందులో అధికంగా వ్యక్తిగతపరమైనవే. ఇటువంటి సమస్యలను పరిష్కరించి, దాదాపు వందేళ్లకుపైగా ఉన్న రికార్డులను మార్పు చేయాలన్న ఉద్దేశంతోనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూముల రీసర్వే ప్రక్రియను ప్రారంభించింది. జిల్లాలో మొత్తం భూముల విస్తీర్ణం 5,78,016 ఎకరాలు కాగా.. 1,75,877 ఎకరాల్లో సర్వే పూర్తిచేసింది. రెండు విడతల్లో 3,09,341 సర్వే రాళ్లను పాతించింది. మొత్తం ప్రక్రియ చేసేందుకు కోట్లాది రూపాయలను వెచ్చించారు. కూటమి ప్రభుత్వం రాగానే రీసర్వే ప్రక్రియపై తప్పుడు ప్రచారం చేయించింది. నాటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి.. రైతుల భూములను లాక్కొనేందుకు వేసిన ఎత్తుగడగా 'ఎల్లో'మీడియాను అడ్డం పెట్టుకుని ఆరోపణలు చేసింది. అధికారంలోకి రావడంతోనే సర్వేను నిలిపివేయించింది. దీంతో రైతుల భూ సమస్యలు యథావిధిగానే ఉండిపోయాయి.

నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురద జల్లేందుకే...

పీజీఆర్‌ఎస్ ద్వారా తీసుకుంటున్న వినతులకే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మోక్షం కలగలేదు. ఇప్పుడు గ్రామాలకు వెళ్లి.. రెవెన్యూ సదస్సులు నిర్వహించి, అదే వినతులు తీసుకోవడంపై రైతు సంఘాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. రీ సర్వేను బూచిగా చూపి, ఎల్లో మీడియా ద్వారా గత ప్రభుత్వంలో పెద్ద ఎత్తున భూ ఆక్రమణలు జరిగాయని ప్రచారం చేయించారు. ఇప్పుడు రైతుల నుంచి ఫిర్యాదుల రూపంలో స్వీకరించి.. సాధారణంగా ఉన్న సమస్యలనే పెద్దవిగా చూపించి తప్పును గత ప్రభుత్వంపై నెట్టివేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినది మొదలు.. 22ఏ, ఫ్రీహోల్డ్ భూములపై పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేయిస్తోంది. రైతుల్లో భయాందోళనలను కలిగిస్తోంది. వాస్తవానికి రీసర్వే వల్ల ఎంతో ప్రయోజనం ఉందని సర్వే అధికారులే అంగీకరిస్తున్నారు. రైతుల నుంచి కూడా ఎక్కడా దీనిపై వ్యతిరేకత వ్యక్తమవ్వలేదు. ఇది తొలిరోజు జరిగిన సదస్సుల్లోనే నిరూపితమైంది. ప్రత్యేకించి రీసర్వేకు సంబంధించిన ఇబ్బందులనే ప్రాధాన్యమిస్తూ వినతులు స్వీకరించాలని దండోరా వేయించి మరీ కూటమి నేతలు డైరెక్షన్ ఇస్తుండడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. రెవెన్యూ సదస్సులు ఉద్దేశం రైతు సమస్యల పరిష్కారమా.. లేక గత ప్రభుత్వంపై నిందలు మోపే ప్రయత్నమా? అన్న చర్చ సాగుతోంది.

తొలిరోజు వినతుల స్వీకరణ ఇలా...

తొలిరోజు జిల్లాలోని 15 మండలాల పరిధిలో 503 రెవెన్యూ గ్రామాలకు గాను 28 గ్రామ సభలు నిర్వహించారు. ఇందులో ఎనిమిది రకాల సమస్యలకు సంబంధించి 503 మంది 462 వినతులు అందజేశారు. ఇందులో అత్యధికంగా మ్యుటేషన్‌కు సంబంధించి 282, వెబ్‌ల్యాండ్ సవరణకు 72, 22ఎ, ఫ్రీహోల్డ్‌కు సంబంధించి 4, ల్యాండ్ గ్రావింగ్–1, ఆక్రమణలపై 6, ఇతర వినతుల 97 ఉన్నాయి. రీ సర్వే సమస్యలకు సంబంధించి ఒక వినతి కూడా అందలేదు.

పార్వతీపురం మన్యం జిల్లాలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులు ఇలా...

మండలాలు	రెవెన్యూ గ్రామాలు	నిర్వహించిన గ్రామసభలు	వినతులు అందజేసిన వారిసంఖ్య	అందిన వినతులు మొత్తం	మ్యుటేషన్‌కు వచ్చినవి	వెబ్‌ల్యాండ్ సవరణకు	ఇతర వినతులు	రీ సర్వే లోపాలపై వచ్చిన వినతులు
15	503	28	503	462	282	72	97	0

న్యూస్‌రీల్

నేడు ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు

పార్వతీపురం: ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (సికింద్రాబాద్) ఆధ్వర్యంలో యువతకు అగ్నిపథ్‌లో ఉద్యోగాల కల్పనపై పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. పదోతరగతి పాసై, పదహారేళ్ల నుంచి 21 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న యువతీ యువకులు ఈ సదస్సుకు హాజరుకావాలని కోరారు. 8న సాలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు యువతకు అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని ఐటీఐ, పాలిటెక్నిక్, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు సదస్సులో పాల్గొని అవకాశాలను అందిపుచ్చుకోవడంపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు.

స్కూల్‌బస్సు బోల్తా.. క్లీనర్ మృతి

- ముగ్గురు విద్యార్థులకు గాయాలు



బోల్తా పడిన బస్సు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో శుక్రవారం సాయంత్రం స్కూల్ బస్సు బోల్తాకొట్టడడంతో క్లీనర్ మృతి చెందగా, ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పార్వతీపురం పట్టణంలోని భాస్కర్ స్కూల్ బస్సు యథావిధిగా సాయంత్రం విద్యార్థులను ఇళ్లకు చేర్చే క్రమంలో 5 గంటల సమయంలో బయలుదేరింది. 15 నిమిషాల వ్యవధిలో స్థానిక బంగారమ్మ కాలనీలో ఓ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనతో ఉలిక్కిపడిన విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. బస్సును మెల్లగా నడపాలని డ్రైవర్ తోట రామకృష్ణను అభ్యర్థించారు. మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ తనకు 15 ఏళ్ల అనుభవం ఉందని, సలహాలు చెప్పొద్దంటూ బస్సును పోనిచ్చారు. జంఝావతి కాలువ మలుపు వద్దకు వెళ్లేసరికి బస్సు బోల్తా కొట్టింది. రెప్పపాటులో జరిగిన ప్రమాదంతో విద్యార్థులు చెల్లాచెదురుగా పడ్డారు. ఆ ప్రాంతమంతా విద్యార్థుల హాహాకారాలు మిన్నంటాయి. వాహనానికి క్లీనర్‌గా పనిచేస్తున్న బాలగుడబ గ్రామానికి చెందిన టి.మురళీకృష్ణ (35) అదె బస్సు కింద ఉండిపోవడంతో చనిపోయాడు. ఈ ఘటనలో 2వ తరగతి చదువుతున్న నిస్మితకు తీవ్ర గాయాలుకాగా, 8వ తరగతి చదువుతున్న ప్రవళిక, 5వ తరగతి చదువుతున్న ఓంకార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. జీవనోపాధినిచ్చిన బస్సే మృత్యుశకటం కావడంలో మృతుని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగినట్టు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోంగార్డు దినోత్సవం రోజు విషాదం

- గుండెపోటుతో హోంగార్డు మృతి
- విచారం వ్యక్తం చేసిన సిబ్బంది



మృతి చెందిన బి.నారాయణస్వామి

పార్వతీపురం టౌన్: హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం రోజునే గుండెపోటుతో హోంగార్డు మృతిచెందడంతో ఆయా సిబ్బందిలో విషాదం అలముకుంది. పార్వతీపురం కలెక్టర్ బంగ్లా వద్ద శుక్రవారం విధులు నిర్వహిస్తున్న బి.నారాయణస్వామి(45) గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి సిబ్బంది వెంటనే స్పందించి జిల్లా ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. మార్గం మధ్యలోనే ప్రాణాలు విడిచినట్లు వైద్యులు తెలిపారు. ఆయన మృతిపై తోటి సిబ్బంది విచారం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం తన స్వగ్రామమైన బలిజిపేట మండలం పెదపెంకి గ్రామానికి తరలించారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న నారాయణస్వామి మృతితో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

శతశాతం ఉత్తీర్ణతకు కృషిచేస్తాం

విజయనగరం అర్బన్: ఇంటర్మీడియట్ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా బోధన సాగిస్తామని జిల్లా కాంట్రాక్టు లెక్చరర్ రెగ్యులైజేషన్ కార్యాచరణ కమిటీ ప్రకటించింది. కమిటీ గౌరవ అధ్యక్షురాలు లంక సంధ్య నేతృత్వంలో కమిటీ సభ్యులు శుక్రవారం ఆర్‌ఐఓ మజ్జి ఆదినారాయణ, డీఐఓ భీమశంకర్‌ను శుక్రవారం కలిశారు. కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- జిల్లా వ్యాప్తంగా 33వేల మెట్రిక్ టన్నులు పూర్తిచేశాం
- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



ధాన్యం కొనుగోలుపై సూచనలు చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

వీరఘట్టం: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. మండలంలోని రైతు ఉత్పత్తిదారుల సేవా కేంద్రాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. అక్కడ ఉన్న రెండు గోదాంలను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చి ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 1.75 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా ఇంతవరకు 33వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని తెలిపారు. వరి పంటకు రెల్లరాల్చు పురుగు వల్ల కలిగే నష్టంపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు. అనంతరం తహసీల్దార్ సత్యనారాయణకు రెవెన్యూ సదస్సుల నిర్వహణపై సూచనలు చేశారు.

పరజపాడులో ఏనుగులు



జియ్యమ్మవలస: మండలంలోని పరజపాడు అరటితోటలో శుక్రవారం ఏనుగుల గుంపు దర్శనమిచ్చింది. కుందరతిరువాడ, పరజపా డు పంట పొలాల్లో రెండు రోజుల నుంచి ఏనుగులు తిరగడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. అరటి, వరి పంటకు నష్టం కలిగిస్తున్నాయని వాపోతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులను తరలించే ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

దళితులు, గిరిజనులకు రక్షణ కరువు

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు:

భారత రాజ్యాంగ రూపకర్త డా.బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం రాష్ట్రంలో కనుమరుగై, టీడీపీ కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం రాష్ట్రంలో అమలవుతోందని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర వాపోయారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన సాలూరు పట్టణంలోని బంగారమ్మపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ రెడ్‌బుక్ రాజ్యాంగంలో దళితులు, గిరిజనులపై దాడులు, కేసులతో వారిని అణగదొక్కుతున్నారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను అమలుచేయాలని కోరిన, ప్రజాసమస్యలపై ప్రశ్నించిన వారిపై వివిధ కేసులు పెట్టి అరెస్ట్ చేస్తూ అప్రజాస్వామిక రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులని కూడా చూడకుండా కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో దళితుడైన ఓ వెలుగు ఉద్యోగిని ఉద్దేశపూర్వకంగా బదిలీ చేశారన్నారు. ఈ కూటమి ప్రభుత్వ రెడ్‌బుక్ పాలనలో దళితులు, గిరిజనులకు రక్షణ కరువైందని నువ్వే మళ్లీ పుట్టి మమ్మల్ని కాపాడాలంటూ అంబేడ్కర్ విగ్రహానికి రాజన్నదొర మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు గొర్లె జగన్, పువ్వల శ్రీనివాసరావు, సింగారపు ఈశ్వరరావు, గిరిరఘు, మద్దిల గోవింద, పిరిడి రామకృష్ణ, మజ్జి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రాథమిక హక్కులకు భంగం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: ప్రజాస్వామ్య ప్రభుత్వంలో పౌరుల ప్రాథమిక హక్కులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భంగం వాటిల్లడం దురదృష్టకరమని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగ ఉల్లంఘన చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. జెడ్పీ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ముందుగా జెడ్పీ చైర్మన్‌తో పాటు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, కార్పొరేటర్లు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మజ్జి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ దేశంలో స్వాతంత్ర్య ఏర్పడినప్పటి నుంచి పౌరుల హక్కులు, బాధ్యతలు, స్వేచ్ఛకు రాజ్యాంగమే ఆధారమన్నారు. ఇప్పుడు ఏపీలో గడిచిన ఆరునెలల కిందట అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అంబేడ్కర్ ఆశయాలను తుంగలోకి తొక్కుతోందన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రశ్నించే వారిని భయపెట్టి అక్రమంగా కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్య, వైద్య రంగాల నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. గడిచిన ఐదేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యాభివృద్ధికి పెద్ద పీటవేసి నిరుపేదలు ఉన్నత విద్యను అభ్యసించేలా చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఫీజురీయంబర్స్‌మెంట్ అందక విద్యార్థులపై ఆర్థిక ఒత్తిడి పెరుగుతోందన్నారు. గత ప్రభుత్వంలో కరోనా వంటి వ్యాధుల బారిని పడిన వారికి ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలందిస్తే నేడు డయేరియా ప్రబలి పదుల సంఖ్యలో మరణాలు సంభవించడం విచారకరమన్నారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని సక్రమంగా అమలు చేయలేని పరిస్థితి రాష్ట్రంలో ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి అంబేడ్కర్ కల్పించిన ప్రాథమిక హక్కులను పౌరులకు కల్పించాలని, లేని పక్షంలో ఆ మహనీయుని ఆశయ సాధన కోసం ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పాల్గొన్నారు.

పోలీస్ శాఖకు హోంగార్డులే వెన్నెముక



హోంగార్డుల డ్రిల్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి

- ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి
- ఘనంగా హోంగార్డుల 62వ వ్యవస్థాపక దినోత్సవం
- విధుల్లో ప్రతిభ చూపిన హోంగార్డులకు ప్రశంసాపత్రాలు అందజేత


పార్వతీపురం టౌన్: పోలీసులతో సమానంగా ప్రజలకు రక్షణపరమైన సేవలందిస్తూ పోలీస్ శాఖకు హోంగార్డులు వెన్నెముకలా మారారని ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి కొనియాడారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన హోంగార్డుల 62వ వ్యవస్థాపక దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 1946లో హోంగార్డు వ్యవస్థ ఏర్పడిన తొలినాళ్లలో ప్రజలకు ఉచితంగా సేవలందించిందని, కాలక్రమేణా హోంగార్డులకు గౌరవవేతనం ఇస్తున్నట్టు వివరించారు. హోంగార్డులు నీతి, నిజాయతీ, చిత్తశుద్ధితో బాధ్యతలు నిర్వర్తించి అందరికీ మార్గదర్శకంగా నిలుస్తున్నారని అభినందించారు. జిల్లాలో హోంగార్డులు ట్రాఫిక్, కమాండ్ కంట్రోల్, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్, పోలీస్ బ్యాండ్, పోలీస్ హాస్పిటల్ విభాగాల్లో పోలీసులతో సమానంగా సేవలందిస్తుండడం అభినందనీయమన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసాపత్రాలను ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. పరేడ్ గ్రౌండ్‌లో హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఒ.దిలీప్‌కిరణ్, ఏఎస్పీ అంకిత సురానా, ఏఆర్ డీఎస్పీ థామస్‌రెడ్డి, ఎస్‌బీ సీఐ రంగరాథం, సోషల్ మీడియా సీఐ శ్రీనివాసరావు, సీఐలు మురళీధర్, గోవిందరావు, ఆర్‌ఐలు శ్రీనివాసరావు, శ్రీరాములు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



హోంగార్డులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్పీ

ఏ మాట నమ్మాలి?

- అయోమయంలో గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు
- విధులకు గైర్హాజరంటూ ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు
- అదే సమయంలో ఉద్యోగాలకు ఢోకా లేదంటూ మంత్రి సంధ్యారాణి ప్రకటన



సాక్షి, పార్వతీపురం మన్యం:

తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ కొద్దిరోజులుగా నిరసన చేపడుతున్న జిల్లాలోని గిరిజన గురుకుల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు ఆయా ప్రిన్సిపాళ్ల నుంచి షోకాజ్ నోటీసులు వెళ్తున్నాయి. ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం, తమ పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయింపు తదితర ప్రధాన డిమాండ్లతో పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలోని గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు రిలే నిరాహార దీక్షలకు దిగిన విషయం విదితమే. వారంతా విధులు బహిష్కరించి, నిరసనల్లో పాల్గొంటున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇటీవల కాలంలోనే వారి స్థానంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని జూనియర్ సిబ్బందిని డిప్యుటేషన్‌పై పంపిస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు ఏకంగా గత నెల 21వ తేదీ నుంచి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవుతున్నారని.. దీనిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆయా గిరిజన గురుకుల పాఠశాలల నుంచి ఉపాధ్యాయులకు నోటీసులు పంపుతున్నారు. పి.కోనవలస ఏపీటీడబ్ల్యూఆర్(బాలుర) పాఠశాల ప్రిన్సిపాల్ పేరిట ఆ పాఠశాలలోని టీజీటీ(సోషల్) అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుడు కె.వీరన్నపడల్‌కు శుక్రవారం నోటీసు జారీ చేశారు. దీనిపై ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు. చర్చలతో సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నించకుండా బెదిరింపులకు దిగడం రాష్ట్ర ప్రభుత్వానికి మంచిది కాదని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ తెలిపారు. ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు ఇస్తున్న షోకాజ్ నోటీసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే వారి పోరాటాన్ని గిరిజన, ప్రజా, ఉపాధ్యాయ, విద్యార్థి, కార్మిక సంఘాల మద్దతుతో మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

విడ్డూరంగా మంత్రి ప్రకటనలు

ఇదే సమయంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చేస్తున్న ప్రకటనలు ఉపాధ్యాయులను మరింత గందరగోళానికి గురిచేస్తున్నాయి. శుక్రవారం సీతంపేట ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తున్న గిరిజన గురుకులాల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులనుద్దేశించి ఆమె మాట్లాడారు. ఉద్యోగాలకు ఎటువంటి ఢోకా లేదని స్పష్టం చేశారు. డీఎస్సీలో నియామకాలు చేపట్టినప్పటికీ.. పని చేస్తున్న ఉపాధ్యాయులను తొలగించేది లేదని తెలిపారు. జీతాల పెంపుపై చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఓవైపు అధికారుల నుంచి షోకాజ్ నోటీసులు పంపిస్తూనే.. మరోవైపు ఉద్యోగాలకు ఢోకా లేదంటూ మంత్రి ప్రకటనలు చేయడంపై గిరిజన సంఘాలు మండిపడుతున్నాయి. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లపై మంత్రి ఇప్పటికీ స్పష్టమైన హామీ ఇవ్వడం లేదని.. ఎన్నాళ్లయినా చాలీచాలని వేతనాలతోనే వారు అవుట్‌సోర్సింగ్ విధానంలోనే ఉండాలన్నది మంత్రి ఉద్దేశమా? అని ప్రశ్నిస్తున్నారు.

క్లుప్తంగా

నేడు మెగా పేరెంట్స్‌డే మీటింగ్

● కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం నిర్వహించే మెగా పేరెంట్స్‌డే మీటింగ్‌ను విజయవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి టెలి కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు ప్రజాప్రతినిధులు, మండల అధికారులు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పేరెంట్స్‌డే మీటింగ్‌కు పాఠశాల ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని, పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల విద్యాప్రమాణాలు, హాజరు శాతం తదితర అంశాలను చర్చించాలని కోరారు. విద్యార్థులకు ఆరోగ్య వివరాలతో ఆరోగ్య కార్డులను అందించాలన్నారు. మంచి ఫ్లెక్సీలను ఏర్పాటుచేయాలని, వాటిమీద ఎవరి ఫోటో ఉండకూదని స్పష్టం చేశారు. రంగోలి, టగ్ ఆఫ్ వార్, వాలీబాల్, టెన్నికాయిట్ తదితర ఆటలను తల్లిదండ్రులకు నిర్వహించాలని, కార్యక్రమాలలో యాంకర్‌లుగా విద్యార్థులు వ్యవహరించాలన్నారు. మొత్తం కార్యక్రమాన్ని డాక్యుమెంట్ తయారు చేయాలని, ఉత్తమ పాఠశాలకు అవార్డు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ



స్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ సేవ శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. సాయంత్రం సీతారామచంద్రస్వామిని అర్చకులు నూతన పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తూర్పు రాజగోపురం వద్దనున్న ప్రాంగణ వేదిక వద్దకు తీసుకువెళ్లారు. అనంతరం దీపాలంకరణ వేడుకను ప్రారంభించారు. వేద మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక ఊయలలో స్వామి వారిని వేంచేపు చేసి దీపపు కాంతుల వెలుగుల్లో ఊంజల్ సేవతో పాటు అష్టోత్తర శత నామావళి అర్చన నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడుగురు పేకాట రాయళ్లకు సోషల్ సర్వీస్ శిక్ష

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఒమ్మి గ్రామంలో పేకాట ఆడుతూ పట్టుబడిన నిందితులకు కోర్టు వినూత్న రీతిలో శిక్షను ఖరారు చేసింది. ఈ మేరకు ఎస్సై గణేష్ మాట్లాడుతూ..గత నెల 17న ఒమ్మి గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కోర్టుకు అప్పగించామన్నారు. కోర్టులో విచారణ అనంతరం ముద్దాయిలకు సోషల్ సర్వీస్ శిక్షను విధిస్తూ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ ఎక్సైజ్ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారన్నారు. ఇందులో భాగంగా రెండు రోజులు ఆస్పత్రిలో, మరో రెండు రోజులు పాఠశాలల్లో క్లీన్ అండ్ గ్రీన్ పనులు చేపట్టాలని తీర్పు ఇచ్చారని ఎస్సై తెలిపారు.

రీజనల్ స్థాయి పాలిటెక్ ఫెస్ట్ ప్రారంభం



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ జీవీ ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ ప్రొఫెసర్ స్వామినాయుడు

విజయనగరం అర్బన్: అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాన్ని కళాశాల స్థాయి నుంచే మెరుగుపరుచుకోవాలని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు అన్నారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలోని రీజనల్ స్థాయి పాలిటెక్ ఫెస్ట్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక విద్యలో అత్యాధునిక నైపుణ్యం ఉన్న విద్యార్థులకు ఉద్యోగావకాశాలు అధికంగా ఉంటాయని అన్నారు. కళాశాల స్థాయి నుంచి ఆ దృక్పథంలో విద్యను అభ్యసించాలని సూచించారు. అకడమిక్ చదువుతోపాటు టెక్ ఫెస్ట్‌ల ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రీజయన్ సాంకేతిక విద్య జాయింట్ డైరెక్టర్ జె.సత్యనారాయణ మూర్తి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జె.ఆశారమణి, జేఎన్‌టీయూ మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీనివాసరావు, చీపురుపల్లి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మెకానికల్ విభాగాధిపతి సత్యనారాయణ, వివిధ విభాగాల అధిపతులు, ఉమ్మడి జిల్లా విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹190

● బంగారు భవిష్యత్తుకు భరోసా
● జిల్లాలో 15 కేంద్రాల ద్వారా సేవలు
● మెలకువలతో కూడిన తర్ఫీదుతో మానసిక వికాసం



బుద్ధిమాంద్యంతో ఇబ్బంది పడుతున్న పిల్లలకు శిక్షణ ఇస్తున్న ఐఈఆర్టీ



భవిత కేంద్రం ద్వారా ప్రత్యేక అవసరాలుగల పిల్లకు అందిస్తున్న సేవలు

భవిత కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ

పాలకొండ రూరల్: శారీరకంగా, మానసికంగా ఎదుగుదల సరిగా లేక ఇబ్బందులు పడుతున్న చిన్నారుల భవిష్యత్ తల్లిదండ్రులకు ఒక సవాల్‌గా నిలుస్తోంది. ఆ చిన్నారులను వైద్యశాలల చుట్టూ తిప్పుతూ ఆర్థికంగా, మానసికంగా తల్లిదండ్రులు కుంగిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో భవిత కేంద్రాలతో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల భవితవ్యానికి భరోసా కలుగుతోంది.

భవిత కేంద్రాల ద్వారా స్వాంతన..

పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు నియోజకవర్గాల పరిధిలో 15 భవిత కేంద్రాలు ఉన్నాయి. వాటి ద్వారా గత ఏడాది నుంచి 1,220 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు నిత్యం మానసిక పరివర్తనతో కూడిన విద్యను అవలంబిస్తూ స్వాంతన పొందుతున్నారు. వారిలో బాలురు 656మంది, బాలికలు 564 మంది ఉన్నారు. తాజాగా ఈ సంవత్సరం సర్వశిక్ష అభియాన్ ద్వారా నిర్వహిస్తున్న సర్వేలో జిల్లావ్యాప్తంగా 1,715 మందికి పైగా చిన్నారులు ఉండడాన్ని గుర్తించారు. భవిత కేంద్రంలో పలువురు చిన్నారులకు సహిత విద్యనందించడమే కాకుండా వారి వైకల్యాన్ని తగ్గించేందుకు, ఇతర చిన్నారులతో కలిసేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారు.

ఈ తరహా చిన్నారులు ప్రత్యేకం...

పూర్తి అంధత్వం, తక్కువ దృష్టి, వినికిడి లోపం, భాషణ లోపం, చలన వైకల్యం, మానసిక వైకల్యం, నిర్దిష్ట అభ్యసన వైకల్యం, మెదడు పక్షవాతం, ఆటిజం, బహుళ వైకల్యం, కుష్ఠువ్యాధిగ్రస్తులు, మరుగుజ్జుతనం, దీర్ఘకాలిక నరాల సమస్య, కండరాల క్షీణత, బహుళ నాడీ వ్యవస్థలో బలహీనత, మానసిక రుగ్మత, యాసిడ్ దాడి బాధితులు, తలసేమియా, హిమోఫీలియా, కొడవలి కణ రక్తహీనత, మెదడు నుంచి నరాల బలహీనత వంటి వారందరూ ప్రత్యేక అవసరాలుగల చిన్నారులుగా గుర్తింపబడతారు. ఈ తరహా 21 రకాల సమస్యలను ప్రశస్థ యాప్ ద్వారా పాఠశాలలో గుర్తించేలా చర్యలు చేపట్టారు. గుర్తించిన సమస్యలను అధిగమించేలా పిల్లలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

సహిత విద్య విభాగం ద్వారా శిక్షణ..

ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు వైకల్యం శాతం పెరగకుండా, ఉన్న వైకల్యాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఏర్పడిన సహిత విద్య విభాగం ద్వారా భవిత కేంద్రాలు అనేక రకాలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

● ఈ కేంద్రాలలో ఇద్దరు ప్రత్యేక ఉపాధ్యాయులతో పాటు ఫిజియోథెరపిస్ట్, స్పీచ్ థెరపిస్ట్, సైకాలజిస్ట్, ఒక సీజీవీ చిన్నారులకు సేవలు అందిస్తుంటారు.

● స్పెషల్ ఎడ్యుకేటర్లు బొమ్మలు, ప్లకార్డులు, పజిల్స్ చూపుతూ మానసిక పరివర్తనతో కూడిన విద్యలో శిక్షణ అందిస్తుంటారు.

● ఒక్కొక్కరికి కొంత సమయాన్ని కేటాయిస్తూ వారి మానసిక స్థితికి అనుగుణంగా అర్థమయ్యే విధంగా శిక్షణ ఇస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు. మాటలు, ఫిజియోథెరపీ, బిహేవియర్ మాడిఫికేషన్ థెరపీ. తదితర సేవలు అందిస్తుంటారు.

● భవిత కేంద్రాలకు వచ్చేవరకు వారి పనులు చేసుకోలేని స్థితిలో, కనీసం ఎదుటి వారిని అర్థం చేసుకోలేని పరిస్థితి నుంచి తమ పనులు తామే చేసుకునే స్థాయికి చేరుకుంటున్నారు.

● ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో సాంకేతికత ఎంతో ముఖ్యమైనది. దీంతో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు ట్యాబ్‌లు, కంప్యూటర్‌ను ఉపయోగించే విధంగా భవిత స్కూల్స్ నిర్వాహకులు శిక్షణ ఇస్తూ చైతన్యపరుస్తున్నారు.

సర్కారు పాఠశాలలో బోధన



జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను గుర్తించే ప్రక్రియను నిరంతరం నిర్వహిస్తున్నాం. ఇటువంటి చిన్నారులు ఉంటే తల్లిదండ్రులు, సంరక్షకులు సమాచారం అందించి చిన్నారుల అభ్యున్నతికి భాగస్వాములు కావాలి. గతంలో ఈ చిన్నారులకు ప్రత్యేకంగా పాఠశాలలు ఉండేవి. ప్రస్తుతం సాధారణ పిల్లలతో కలిసి చదువుకోవాలన్న లక్ష్యంతో సర్కారు పాఠశాలలోనే భవిత కేంద్రాలను నెలకొల్పి అక్కడే ప్రత్యేక, సాధారణ ఉపాధ్యాయులతో సహిత విద్యా లక్ష్యాలకు అనుగుణంగా బోధన అందిస్తున్నాం. ప్రశస్థ యాప్ ద్వారా 21 రకాల స మస్యలతో కూడిన పిల్లను గుర్తించి సేవలు విస్తృతం చేస్తున్నాం.

పి.భానుమూర్తి, సహిత విద్యా జిల్లా కోఆర్డినేటర్, పార్వతీపురం మన్యం

మానసిక, శారీరక ఎదుగుదలకు



ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల మానసిక, శారీరక ఎదుగుదల, అభ్యున్నతికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. ఆటపాటలతో కూడిన విద్యను బోధిస్తున్నాం. కేంద్రానికి వచ్చిన సమయానికి, ప్రస్తుతం పాఠశాలలో అభ్యసిస్తున్న సమయానికి పిల్లల మానసిక ప్రవర్తనలో పురోగతి కనిపిస్తుంది. చిన్నారులు సహ విద్యార్థులతో మాట్లాడడం, చదవడంచేస్తున్నారు. వారి ప్రవర్తనలో మార్పు రావడం ఆనందంగా ఉంది. ఈ చిన్నారులను గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నాం. తల్లిదండ్రులను చైతన్యపరిచి పిల్లలు కేంద్రానికి వచ్చే విధంగా కృషిచేస్తున్నాం. అవసరమైతే వారి ఇళ్ల వద్దకు వెళ్లి సేవలు కొనసాగిస్తున్నాం.

ముదిలి అరుణ, ఐఈఆర్టీ, పాలకొండ భవిత కేంద్రం

అంతా వారిష్టం..!

● మధ్యాహ్నమే కార్యాలయం మూసివేత
● తెరుచుకోని ఖాదీగ్రామీణ ప్రభుత్వ కార్యాలయం
● కొద్ది రోజులుగా ఇదే వరస



మధ్యాహ్నానికే మూసి ఉన్న కార్యాలయం

విజయనగరం రూరల్: అర్హులైన వారందరికీ గ్రామాల్లో చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటుచేసుకునేందుకు రాయితీలు కల్పిస్తాం. ఆసక్తి ఉన్న వారంతా జిల్లా కేంద్రంలోని ప్రదీప్ నగర్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఒకవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతుంటే ఇక్కడి కార్యాలయ సిబ్బంది మాత్రం వారికి నచ్చినప్పుడు కార్యాలయం తెరవడం, లేనప్పుడు మిట్టమధ్యాహ్నానికే మూసివేయం చేస్తున్నారు. ప్రధానంగా జిల్లా అంతటికీ ఒకేఒక కార్యాలయం అయ్యినప్పటికీ కార్యాలయంలో ఉన్న ఆఫీస్ సబార్డినేట్, కంప్యూటర్ ఆపరేటర్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ లలో శుక్రవారం ఏ ఒక్కరూ కార్యాలయంలో లేకపోవడంతో పాటు కార్యాలయానికి తాళాలు వేసి ఉండడం చూస్తుంటే ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏ తీరులో ఉందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ కార్యాలయాలు మిట్టమధ్యాహ్నమే మూసివేయడంపై స్థానికులు నవ్వుకుంటున్నారు. ఇదేనా ప్రభుత్వ పాలనతీరు అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత కార్యాలయం ఎ.డి మురళీకృష్ణ వద్ద సాక్షి ప్రస్తావించగా కార్యాలయం తెరిచే ఉంచాలని, మూసివేసినట్లు తనకు తెలియదన్నారు. ఉన్న సిబ్బంది ముగ్గురు అవుట్ సోర్సింగ్‌కు చెందిన వారే అయినప్పటికీ కార్యాలయం మూసి ఉంచరాదని స్పష్టం చేశారు. తాను కార్యాలయం ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నానని తెలిపారు.

గిరిజన గ్రామాలకు రోడ్లు నిర్మిస్తాం



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సీతంపేట: రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన గ్రామాలకు 2 వేల రోడ్లను రూ.2,500 కోట్లతో నిర్మిస్తామని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ఐటీడీఏలో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో పథకాల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రహదారులు లేని గ్రామాలకు ముందుగా రోడ్లు నిర్మించాలన్నారు. తాగునీరు లేని గ్రామాలు ఉండరాదన్నారు. వన్‌ధన్ వికాస్ కేంద్రాలను బలోపేతం చేయాలన్నారు. ట్రైకార్ రుణాలను గిరిజనులకు మంజూరు చేస్తామని తెలిపారు. గిరిజన ప్రాంతాలకు ఫీడర్ అంబులెన్స్‌లు కేటాయిస్తామని చెప్పారు. ప్రతి వసతిగృహానికి త్వరలో ఏఎన్‌ఎంలను నియమిస్తామని చెప్పారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఆశ్రమపాఠశాలల్లో మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. కొంతమంది ఉద్యోగుల పనితీరుపై ఆరోపణలు వస్తున్నాయని సరిచేసుకోవాలన్నారు. అనంతరం స్థానిక జలవిహార్‌లో చేపపిల్లలు వదిలారు. కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి, ఏపీవో చిన్నబాబు, డుమాపీడీ రామచంద్రరావు, ట్రైబుల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, డిప్యూటీఈవో నారాయుడు, ఈఈ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

● డైట్ ప్రిన్సిపాల్ పగడాలమ్మ
● ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా కళాఉత్సవ్ పోటీలు



ఫస్ట్‌ప్రైజ్ సాధించిన విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

నెల్లిమర్ల: విద్యార్థుల్లో సజనాత్మకతను వెలికితీయాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపైనే ఉందని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ జి.పగడాలమ్మ అన్నారు. ఈ మేరకు నెల్లిమర్ల పట్టణ పరిధిలోని వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాలలో ఉమ్మడి విజయనగరం జిల్లా కళాఉత్సవ్ 2024-25 పోటీలు శుక్రవారం ఎంతో ఉత్సాహంగా జరిగాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన 50 పాఠశాలల నుంచి 168 విద్యార్థులు ఆసక్తికరంగా పోటీల్లో పాల్గొన్నారు. గాత్రసంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, దృశ్యకళలు, సంప్రదాయక కథలు చెప్పడం అనే అంశాలలో ఈ పోటీలు నిర్వహించారు. గాత్ర సంగీతంలో ఎస్.యోజిత (మొయిద), వాయిద్య సంగీతంలో బి.శివాత్మిక(విజయనగరం), నృత్యంలో బి.గాయత్రి అండ్ టీమ్(అంబేద్కర్ గురుకులం), నాటకంలో పి.సురేంద్ర అండ్ టీం(మొయిద), దృశ్యకళలో పి. సౌజన్యమణి(ఎంజేపీఏపీ గురుకులం,నెల్లిమర్ల), సంప్రదాయక కథలు చెప్పడంలో ఎస్.యోగశ్వని, బి.నవ్య(ఎంజేపీఏపీ గురుకులం,నెల్లిమర్ల) ప్రథమ బహుమతులు సాధించారు. ఈ పోటీలకు ఎం.ఆదియ్య, వి.నారాయణమూర్తి, ఏవీఆర్‌డీ ప్రసాద్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీలు డైట్‌లెక్చరర్లు పి. రవికుమార్, కె.సూర్యారావు, ఎల్ రామకృష్ణారావుల సారథ్యంలో జరిగాయి. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డి.ఈశ్వరరావు, వీవీజేఎస్ సుబ్రహ్మణ్యం, ఎ శ్రీనివాస్, ఎం.రామకృష్ణ, వి.భారతి, కార్యాలయం పర్యవేక్షకురాలు కమలకుమారి పాల్గొన్నారు.

రైతన్నకు అపార నష్టం

● తుఫాన్‌తో తీవ్రంగా దెబ్బతిన్న వరిపంట
● రంగు మారిన ధాన్యం 1934 మెట్రిక్ టన్నులు



విజయనగరం ఫోర్ట్: ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు సిరపురపు సన్యాసయ్య. ఈయనది విజయనగరం మండలం రాకోడు గ్రామం. ఖరీఫ్‌లో 1121 రకం సాగు చేశాడు. తుఫాన్ కారణంగా ఎకరంన్నర పొలంలో వరి పంట తడిచింది. దీంతో ధాన్యం మొలకలు వచ్చి రంగు మారింది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు దోకుల అప్పలసత్యం. ఈ యనది గంట్యాడ మండలం పెదవేమలి గ్రామం. ఖరీఫ్‌లో 1121 రకం వరి పంట రెండు ఎకరాల్లో సాగు చేశాడు. తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు రెండు ఎకరాల్లో వరి పంట తడిచిపోయింది. దీంతో ధాన్యం రంగు మారాయి.

ఈ పరిస్థితి ఈ ఇద్దరి రైతులదే కాదు. జిల్లాలో వేలాది మంది రైతులకు చెందిన వరిపంట ఫెంగల్ తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు తడిచింది. దీంతో అధిక సంఖ్యలో వరి పంట దెబ్బతింది. నష్టం అధిక సంఖ్యలో జరిగినప్పటికీ వ్యవసాయ అధికారులు మాత్రం తక్కువగా నష్టం జరిగినట్లు చూపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్షాలకు దెబ్బతిన్న వరి పంటను గుర్తించడానికి ఇంకా కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయ సిబ్బంది క్షేత్ర స్థాయి పర్యటన చేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వరి పంట దెబ్బతింది. పరిశీలించడానికి రండని కొంతమంది రైతులు వ్యవసాయ సిబ్బందిని కోరినప్పటికీ రావడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రంగు మారిన ధాన్యానికి ఎటువంటి పరిహారం రాదని, అలాంటి దానికి రావడం ఎందుకని వ్యవసాయ సిబ్బంది రైతులకు చెబుతున్నట్లు తెలుస్తోంది.

మండలాల వారీగా రంగు మారిన ధాన్యం వివరాలు

మండలం	మెట్రిక్ టన్నులు
బొండపల్లి	275
గంట్యాడ	161
జామి	280
ఎల్.కోట	157
ఎస్.కోట	225
విజయనగరం	132
నెల్లిమర్ల	104
గుర్ల	113
గజపతినగరం	70



గంట్యాడ మండలం పెదవేమలిలో మొలకలు, రంగు మారిన ధాన్యం

1934 మెట్రిక్ టన్నుల ధాన్యం రంగు మారినట్లు గుర్తింపు

జిల్లాలో ఫెంగల్ తుఫాన్ కారణంగా 1934 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే మొలకలు వచ్చి రంగు మారినట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు. వాస్తవంగా ఇంకా అధిక సంఖ్యలో ధాన్యం రంగు మారినట్లు తెలుస్తోంది. జిల్లాలో దాదాపు 5వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం రంగు మారినట్లు సమాచారం.

జాతీయ వాలీబాల్ పోటీల్లో విజేతలుగా నిలవాలి

● డీఈఓ యు.మాణిక్యం నాయుడు



వారణాసిలో జరగనున్న స్కూల్‌గేమ్స్ వాలీబాల్ పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులు

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న స్కూల్‌గేమ్స్ అండర్-14 బాల, బాలికల వాలీబాల్ పోటీల్లో పాల్గొనబోయే ఆంధ్రప్రదేశ్ జట్లు విజేతలుగా నిలవాలని డీఈఓ యు.మాణిక్యం నాయుడు పిలుపునిచ్చారు. ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు వారణాసిలో జరగనున్న అంతర్ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ పోటీల్లో పాల్గొనబోయే అండర్-14 జట్ల క్రీడాకారులకు శుక్రవారం ఆయన తన కార్యాలయంలో క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభాపాటవాలు కనబరిచిన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని సూచించారు. ప్రతిభ గల క్రీడాకారులు సమష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి వెంకటరమణ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి టీవీ భగవాన్‌దాస్, జిల్లా కార్యదర్శి కేవీఎస్ రాజు, జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కృష్ణంరాజు, ఇరు జట్ల కోచ్ అండ్ మేనేజర్‌లు దేవమణి, రమణలు పాల్గొన్నారు.

సీనియర్స్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్లు పయనం



సీనియర్స్ కబడ్డీ పోటీలకు పయనమవుతున్న జిల్లా జట్లతో అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న సీనియర్స్ స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్లు శుక్రవారం పయనమయ్యాయి. ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో జరగనున్న అంతర్ జిల్లాల పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించే క్రీడాకారులకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ఐవీపీ రాజు చేతుల మీదుగా క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కె.వి.ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావు, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా వైఎస్సార్‌సీపీ

● యశ్వంత్ కుటుంబానికి పరామర్శ
● గ్రామానికి వచ్చిన పార్టీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు
● మాజీ ఎమ్మెల్యేలు కళావతి, జోగారావు



యశ్వంత్ కుటుంబసభ్యులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు భరోసా ఇస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జోగారావు, కళావతి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

వీరఘట్టం: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది. దొంగకేసులు పెడుతున్నారు. ప్రభుత్వాన్ని ఎవరైనా విమర్శిస్తూ పోస్టింగ్‌లు పెట్టినా, ఫార్వర్డ్ చేసినా కేసులు పెట్టే దయనీయ పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని వైఎస్సార్‌సీపీ టాస్క్‌ఫోర్స్ జిల్లా కన్వీనర్ అలజంగి జోగారావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి అన్నారు. రెండు రోజుల క్రితం సీఐడీ పోలీసులు అక్రమ కేసులు బనాయించి వీరఘట్టం మండలం దశమంతుపురం గ్రామానికి చెందిన విద్యార్థి అలజంగి యశ్వంత్‌ను అరెస్టు చేయడంతో బాధిత విద్యార్థికి వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అండగా నిలిచి యశ్వంత్‌ను పూచీకత్తుపై విడిపించింది. ఈ నేపథ్యంలో గుంటూరు నుంచి గ్రామానికి వచ్చిన యశ్వంత్‌ను శుక్రవారం వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు పరామర్శించి తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు తమ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని స్పష్టం చేశారు.

వలంటీర్లూ అధైర్య పడొద్దు

జగనన్న సైన్యంగా గత ఐదేళ్లుగా రాష్ట్ర ప్రజలకు సేవలందించిన వలంటీర్లు అధైర్య పడవద్దని మాజీ ఎమ్మెల్యేలు జోగారావు, కళావతి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్ రాజు సూచించారు. దశమంతపురం గ్రామానికి వైఎస్సార్‌సీపీ నాయకులు రావడంతో గ్రామానికి చెందిన వలంటీర్లు వారిని కలిసి తమ సమస్యలను తెలియజేశారు. ప్రస్తుత ప్రభుత్వం తమను వలంటీర్లుగా గుర్తించక పోయినప్పటికీ తాము ఎన్నటికీ జగనన్న సైన్యంగానే ఉండిపోతామని వలంటీర్లు అన్నారు. వారితో పాటు పాటు సర్పంచ్ వావిలపల్లి ఉషారాణి, హరిబాబు, వీరఘట్టం ఎంపీపీ దమలపాటి వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు లక్ష్మణరావు, బాలకృష్ణ, కర్రి గోవిందరావు, లీలా ప్రసాదరావు, పిన్నింటి శ్రీను, బోగి మని, సంబాన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్ రెడ్డి మేలు ఎన్నటికీ మరువం



మా కుమారుడు యశ్వంత్‌పై సీఐడీ పోలీసులు అక్రమ కేసులు పెట్టి అన్యాయంగా అరెస్ట్ చేశారు. ఈ కేసు నుంచి ఏ విధంగా బయటపడాలో తెలియక తీవ్ర ఆందోళనకు గురయ్యాం. వైఎస్సార్‌సీపీ లీగల్ టీం వచ్చి ధైర్యం చెప్పి భరోసా ఇచ్చారు. మా తరఫున కోర్టులో కేసు వాదించి అండగా నిలిచారు. వారందరూ మాకు సహకరించేలా పంపించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మేలు ఎన్నటికీ మరువలేము.

యశ్వంత్ తల్లిదండ్రులు అలజంగి వెంకటనాయుడు, వెంకటరత్నం

సాక్షి క్లాసిఫైడ్స్

FLAT FOR SALE
విజయనగరం టౌన్, RTC కాంప్లెక్స్ దరి
3 BHK 1425 Sft. N/F గ్రౌండ్ ఫ్లోర్ మరియు
2 BHK 1100 Sft. బ్యాంక్ లోన్స్, కార్ పార్కింగ్
అన్ని సౌకర్యాలతో అమ్మకానికి కలదు. డైరెక్ట్ పార్టీ
98495 19777

FLAT FOR SALE
■ 28 Lakhs Madhuram Enclave Ready Occupation Car Parking & Lift. Padavathi Nagar, 6 Lane, Vizianagarm. Cont : 92466 24248 [V- 824005]

CHANGE OF NAME
■ I, CHATTIKAM MURALI MOHAN S/o. Late MALLESWARA RAO R/o. 14-32-109/56/3 Ashoknagar Pedagantyada Visakhapatnam Andhra Pradesh-530044, changed my minor Son's name from GANTA VENKATA SAI BHAVESH alias CKATTIKAM VENKATA SAI BHAVESH to CHATTIKAM PRANAV VEDANSH aged 8 Years. [I-1242820]

WANTED
■ టోర్న ఆవాకాము GOLDEN VENTURES, R&b రోడ్డు నందు మెయిన్ బ్రాంచ్ నందు ... 10K to 35k ... cell 7569325969, 9494438532 [S-1244351]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1253939]

■ ప్రముఖ కంపెనీ నందు వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- టెన్త్ to డిగ్రీ, Sal:- 20k-25k ఉచిత రూము భోజనం సదుపాయం, వర్క్ ఫ్రం హోం అవకాశముంది. 9019041491 [G-9088]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం. HYD. 8317512135 [HA-99202]

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-14790]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. Ph: 9640400073, 9160900024 [HA-1388]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.